క్లుప్తంగా

నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నేడు పట్టాల పంపిణీ

నూజివీడు: మండలంలోని అసైన్డ్‌భూములు కలిగిన లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు పత్రాలను సోమవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా అందజేస్తున్నట్లు తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు యనమదల, రావిచర్ల, ముక్కొల్లుపాడు, దిగవల్లి, బత్తులవారిగూడెంలకు చెందిన లబ్ధిదారులకు నూతన అసైన్‌మెంట్ పట్టాలను అందజేస్తారని పేర్కొన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా అసైన్డ్ భూములకు పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్‌ఐటీలో హెల్పింగ్ హ్యాండ్స్ సౌజన్యంతో అశ్విని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో విజయవాడకు చెందిన చైతన్య కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు ఏ శ్రీనివాస్, ఏ గీతా, చైతన్య అరవింద్, నిఖిల మీనాక్షి పాల్గొని విద్యార్థులకు, సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు.

పుణ్యస్నానాలకు ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం: కార్తిక సోమవారం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు, భద్రత కల్పించాలని విజయవాడ క్రైమ్ అసిస్టెంట్ డీసీపీ వెంకటరత్నం సూచించారు. కార్తిక పుణ్యస్నానాలు పురస్కరించుకుని గుంటుపల్లి, ఫెర్రీ, పవిత్రసంగమం, దాములూరులో స్నాన ఘాట్లు ఆదివారం పరిశీలించారు. ఫెన్సింగ్ లేని ఘాట్లులో తాత్కాలిక ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘాట్లు వద్ద పరిశుభ్రతతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోట్లులో గజఈతగాళ్లు, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సీఐ పి.శ్రీనుకు సూచించారు.

ఘనంగా బాబా జయంతి



చీమలపాడు(ఏ.కొండూరు) : మండలంలోని చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్‌లో శనివారం రాత్రి హజరత్ సూఫీ మహమ్మద్ ఆతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి జయంతి వేడుకలు పీఠాధిపతులు మహమ్మద్ ఖాజా మొయిద్దీన్ తాజ్ ఖాదరి బాబా, మహమ్మద్ ఖలీల్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ ఆరున్నర దశాబ్దాలుగా నిరాటంకంగా అన్న ప్రసాద వితరణ నేటి వరకు కొనసాగుతూనే ఉందన్నారు. అనంతరం బాబా దివ్య సమాధి వద్ద చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా బాబా భక్తులు పాల్గొని సమాధిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. మహమ్మద్ జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

నూజివీడు: డిపో కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ రజనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ నూజివీడు డిపో కార్యదర్శి రంగు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక డిపో గేట్ వద్ద ఆదివారం కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోలో పూర్తి చార్టు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. అక్రమ ఓడీ లను రద్దు చేయాలని, సీనియర్లను నియమించాలన్నారు. మీటింగ్‌లో అధ్యక్షుడు గంగాధరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరంజీవి, జోనల్ సభ్యులు ఎండీ యాకూబ్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలి

ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్నో అవకాశాలు కల్పించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ, ఆర్థిక ప్రగతి కల్పించేందుకు రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరచిన అంబేడ్కర్ పూజ్యనీయులని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలకు లోబడి ప్రతి పౌరుడూ నడుచుకోవాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, చిన్నారి, శ్రీనివాసరావు, ప్రకాష్‌రెడ్డి, మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు సత్యనారాయణ, బాలకృష్ణ, నాగేశ్వరరావు, హనుమంతు పాల్గొన్నారు. తిరువూరు నగరపంచాయతీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి కమిషనర్ బాలకృష్ణ, చైర్‌పర్సన్ కస్తూరిబాయి, కౌన్సిలర్లు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ పవిత్రత కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

తోటమూలలో..

తోటమూల(గంపలగూడెం): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గంపలగూడెం మండలం తోటమూల వై. జంక్షన్లో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ కోట దాసు, విశ్రాంత ఉపాధ్యాయులు మోజెస్, ప్రజా సంఘాల నాయకులు ఆదాం, ఎం.కుటుంబరావు, రంజిత్, శంకరాచారి పాల్గొన్నారు.



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

హక్కులను కాపాడుకుందాం

చాట్రాయి: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకుందామని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి అన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం ముత్తయ్య పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి హైస్కూల్లో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాధికారాణి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించేందుకు అంబేడ్కర్‌తో పాటు ఎందరో మహానుభావులు కృషి చేశారన్నారు.

ఏ.కొండూరులో..

ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడులో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి సతీష్, ఎం.వెంకటేశ్వరరావు, కే రాజు, నాగేశ్వరరావు, వసంతరావు, ఫ్రాన్సిస్, అనిల్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడు ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని నాగులూరులోని సచివాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం అంబేడ్కర్ చిత్ర పటానికి రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి నివాళులర్పించారు. సర్పంచ్ ముదగాణ నాగబాబు, నాయకులు వీరస్వామినాయుడు, రామారావు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, డాక్టర్ సందేశ్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునునూరులో..

ముసునూరు: భారత రాజ్యాంగం ప్రపంచ దేశ రాజ్యాంగాలకే ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలు, గ్రంథాలయాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొర్లగుంట, వేల్పుచర్ల గ్రామాల్లో సర్పంచ్‌లు నక్కనబోయిన సత్యనారాయణ, పుట్ల మోహనరావు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



గంపలగూడెం మండలం తోటమూలలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ వద్ద ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాగ దినోత్సవ విశిష్ట వివరించారు. బ్రాంచి అధ్యక్షుడు ఉమా విజయ్‌చంద్, రాష్ట్ర నాయకులు మనోహర్ సాల్మన్‌శాస్త్రి, ఎస్‌ఈలు, డీఈలు పాల్గొన్నారు. జూపూడి నిమ్రా కళాశాలలో అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు.

మైలవరంలో..

మైలవరం: ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే రక్ష అని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఏ ఆదిశేషారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.శివహరిప్రసాద్, ఎస్ ఉమామహేశ్వరరెడ్డి డీన్స్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక నాయకులు కొండా రాజ్‌కుమార్, గొర్రె లాజర్, పిల్లి రాజేష్, లక్ష్మయ్య, పవన్, శ్రీనివాస్, వీరకోటి, సూరిరాజు, ధనరాజు, రాజేంద్రప్రసాద్, వెంకటస్వామి, మోహనరావు, జయరాజు, రామారావు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ఆదర్శం

ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రపంచ దేశాలకు భారతదేశ రాజ్యాంగం ఆదర్శమైనదని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం వల్ల సార్వభౌమాధికార, సర్వసత్తాక రాజ్యంగా భారతదేశం అవతరించిందన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతూ విధులను నిర్వహించాల్సిందేనన్నారు. ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు లాం ప్రసాదరావు, కౌన్సిలర్లు నాగమల్లేశ్వరరావు, దాసరి మారు అప్పాజీ, నాయకులు సుగుణరావు, నాగేశ్వరరావు, చంటి, మున్నా, జోగారావు, సతీష్ పాల్గొన్నారు.



తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



సూరంపాలెంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ



గొల్లపల్లి హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం రాధికారాణి



ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్



రెడ్డిగూడెం మండలం నాగులూరులో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

మాదిగలు, మాలలు రెండు కళ్లు లాంటివారు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మాదిగలు, మాలలు తనకు రెండు కళ్లు లాంటి వారని, త్వరలోనే మాదిగలకు నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రకటించారు. పట్టణ పరిధిలోని ట్రిపుల్‌ఐటీ సమీపంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మీయ వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఎన్నికలో ఎస్సీలు తనకు అండగా ఉంటున్నారని, రాబోయే ఎన్నికల్లో కూడా నియోజకవర్గంలోని మాల, మాదిగలందరూ అండగా ఉండాలని కోరారు. రాజకీయ పదవుల్లో సైతం అధికశాతం ఎస్సీలకే కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేనన్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ పేదల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా ఉండాలన్నారు. మాదిగలందరూ తమ జాతి అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ వల్లనే పేదలకు గుర్తింపు లభించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మాదిగలంతా సీఎంకు మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావును సత్కరించారు. లిడ్‌క్యాప్ చైర్మన్ కే రాజశేఖర్, ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, విజయవాడ డెప్యూటీ మేజర్ గ్రిఫ్టన్, ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు ప్రతాప్, నూజివీడు మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు, చాట్రాయి ఎంపీపీ నిర్మల పాల్గొన్నారు.



మాదిగల ఆత్మీయ వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నవజీవన్ బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్ జాకబ్ రాజు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అజరయ్యపేటలోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం, రామాయమ్మరావుపేటలోని బీసీ బాలుర వసతిగృహంలో ఆదివారం మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు ప్రాణాంతకమని, వాటికి దూరంగా ఉండాలన్నారు. జోనల్ కోఆర్డినేటర్ బి.రవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని, ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు మండలం పోలసానపల్లిలో బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అవసరమనుకుంటే 94904 92020కి ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. వార్డెన్‌లు సుబ్బారావు, విజయబాబు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో వీరభద్రస్వామికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా కార్తీకమాసంలో గురుపౌర్ణమి రోజున ఆలయం వద్ద నిర్వహించే స్వామి కల్యాణ మహోత్సవాల్లో ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి గంగుల వడ్డీకాసులు ఎమ్మెల్యేకు స్వామి వారి ఆశీర్వచనాలు అందించారు. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ శిరీష, సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, జంగంగూడెం సర్పంచ్ అంజనీకుమారి, నాయకులు రాంబాబు, అశోక్ పాల్గొన్నారు.



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఘనంగా కురియన్ జయంతి

తిరువూరు: క్షీరవిప్లవ పితామహుడు కురియన్ జయంతి కార్యక్రమాలు తిరువూరు పాలశీతల కేంద్రం పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో, పాల ఉత్పత్తిదారుల సంఘాలు, పాల సేకరణ కేంద్రాల్లో కురియన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి సంఘ కార్యవర్గ సభ్యులు నివాళులర్పించారు. పాల ఉత్పత్తి పెంపుదలకు కురియన్ చేసిన కృషిని పాలశీతల కేంద్ర మేనేజరు సాంబశివమూర్తి రైతులకు వివరించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని కొత్తరెడ్డిగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నందు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కృష్ణామిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు ఆంజిరెడ్డి నివాళులర్పించారు. సంఘం డైరెక్టర్లు బాపిరెడ్డి, జమలారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జి. నరసింహారెడ్డి, బి. నరసింహారెడ్డి, వాణి పాల్గొన్నారు.



తిరువూరులో కురియన్ జయంతి

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి

గంపలగూడెం: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని గంపలగూడెం మండలంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గంపలగూడెం గంగా, పార్వతీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, పెనుగొలను రామలింగేశ్వరస్వామి ఆలయం, మేడూరు 1,116 శివలింగాల జీవన్ముక్తీశ్వర స్వామి ఆలయం, గోసవీడు మల్లికార్జున స్వామి, కొత్తపల్లి ఉమా గౌరి శంకర ఆలయం, నెమలి శివాలయాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. గోసవీడు ఆలయంలో శివలింగాకారంలో ప్రమిదలు ఉంచి దీపోత్సవం నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లోను, ఆగిరిపల్లిలో మహిళలు దీపోత్సవ కార్యక్రమాలను సత్రం సెంటర్‌లోని శివాలయం వద్ద ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ భవాని ఆధ్వర్యంలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ మూర్తి పూజలు జరిపించారు.

లక్ష దీపార్చన

ముసునూరు: కార్తిక పౌర్ణమి సందర్భంగా బలివేలోని బలే రామస్వామి ఆలయంలో భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. రాత్రి లక్ష దీపార్చన జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ దంపతులు స్వామికి పూజలు చేశారు.



బలివే రామస్వామి ఆలయ ప్రాంగణంలో లక్ష దీపార్చన

తిరువూరులో..

తిరువూరు: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి తిరువూరుని శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. చంద్రమౌళీశ్వరాలయం, రామలింగేశ్వరాలయాల్లో పరమేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

చాట్రాయి: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. సి గుడిపాడు శివాలయం, చాట్రాయి ఉమారామలింగేశ్వర ఆలయాల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మందిగా భక్తులు తరలివచ్చి ప్రమిదలు వెలిగించి స్వామికి పూజలు చేశారు.



గంపలగూడెం మండలం అర్లపాడులో దీపోత్సవం



ఆగిరిపల్లిలోని శివాలయం వద్ద దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖర స్వామి(శివాలయం)లో కార్తిక పౌర్ణమి వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కుక్కడపు హనుమాన్ వెంకటరత్నం, దీప్తి దంపతులు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యుల సమక్షంలో జ్వాలా తోరణం నిర్వహించారు.

భాస్కరరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

పుట్రేల (విస్సన్నపేట): తిరువూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మండలంలోని పుట్రేల గ్రామానికి చెందిన కె.కాంతారావు తండ్రి భాస్కరరావు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆదివారం ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత భాస్కరరావు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వాలీబాల్ కోర్టు ప్రారంభం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో నూతనంగా నిర్మించిన మూడు వాలీబాల్ కోర్టులు, ఫ్లడ్‌లైట్లు వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. 15ఏళ్లగా మూలన పడిన వాలీబాల్ కోర్టులను పునర్నించుకోవడం అభినందనీయమని సీడబ్ల్యూఎం తెలిపారు. కోర్టులను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులకు సూచించారు. నూతన ప్లే కోర్టుల్లో చత్రపతి శివాజీ, భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్ అనే టీమ్‌లు వాలీబాల్ పోటీల్లో తలపడ్డాయి. వాలీబాల్ జాతీయ రిఫరీ డానియేల్ పాల్గొన్నారు.



వాలీబాల్ కోర్టును ప్రారంభించిన సీడబ్ల్యూఎం శ్రీనివాస్

బుద్ధుడి విగ్రహాన్ని పునర్నిర్మించాలి

ఇబ్రహీంపట్నం: పవిత్ర సంగమం వద్ద బుద్ధుడి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులను అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ కోరారు. సంగమం వద్ద పాక్షికంగా ధ్వంసమైన బుద్ధుడి విగ్రహాన్ని ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే నూతన విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలోసీఐటీయూ నాయకులు బి.రామ సీత, కె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎన్టీటీపీఎస్ ఉద్యోగి మృతి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో జూనియర్ ప్లాంట్ అటెండెంట్ (జేపీఏ)గా పని చేస్తున్న నల్లమోతు రాజేశ్వరరావు (45) గుండె పోటుతో ఆదివారం మృతి చెందాడు. వ్యక్తిగత పనులపై స్థానిక రింగ్‌సెంటర్‌కు వెళుతున్న ఆయన రోడ్డుపై ఒక్కసారిగా హర్ట్ ఎటాక్‌కు గురయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఒకబాబు, పాప ఉన్నారు.